నమస్తే తెలంగాణ
సంగారెడ్డి

I | హైదరాబాద్, ఆదివారం 29 డిసెంబర్ 2024 | SANGAREDDY

సంగారెడ్డి జిల్లా చిట్కుల్ గ్రామం సర్వేనంబర్ 329లో నిర్మిస్తున్న ఇండ్లు

ప్రభుత్వ భూమికి ఎసరు!

సర్కారు భూమిని కబ్జా చేస్తున్న నేతలు

సంగారెడ్డి జిల్లా చిట్కుల్‌లో 329 సర్వేనంబర్ భూమిలో అనకొండలు

- సెలవుల మాటున జోరుగా ఇండ్ల నిర్మాణం
- 2008లో పేదలకు ఇచ్చిన పట్టాలు తెరమీదికి
- గతంలోనే అక్రమ నిర్మాణాలు కూల్చిన అధికారులు
- ఖాళీ జాగాలను కబ్జా చేసి మళ్లీ ఇండ్ల నిర్మాణం
- గతంలో పట్టాలు పొందిన వారికి బెదిరింపులు
- చోద్యం చూస్తున్న అధికారులు
- మున్సిపల్ విలీన ప్రకటనతో జీపీ నుంచి ఇంటి నంబర్లు పొందేందుకు ప్లాన్

ఆర్ఐ ఖాజా, గ్రామ కార్యదర్శి కవితతో వాగ్వాదం చేస్తున్న ఇండ్ల నిర్మాణ దారులు, మూడు రోజుల్లోనే నిర్మాణం పూర్తి చేసుకున్న ఇల్లు

పటాన్‌చెరు, డిసెంబర్ 28: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 329లో అనకొండలు ఖాళీ జాగాలను మింగుతున్నారు. త్వరలో చిట్కుల్ మున్సిపాలిటీలో విలీనం అవుతుందనే ప్రకటనతో మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రభుత్వ సర్వేనంబర్‌లో ఖాళీ జాగాలను కబ్జాచేసి నిర్మాణాలు చేస్తున్నారు. క్రిస్మస్‌తో పాటు వచ్చిన వరుస సెలవులను గుర్తించిన కబ్జారాయుళ్లు పావులు కదిపి ఖాళీ జాగాలో ఇండ్లను చకచకా నిర్మిస్తున్నారు. మూడు రోజుల్లోనే కొందరి పునాదులు, గొడలు పూర్తి అయ్యాయి. ఇంకొన్ని నిర్మాణంలో ఉన్నాయి. వంద నుంచి రెండు వందల గజాల మేరకు నాయకులు, వారి అనుచరులు కబ్జాలు చేసి ప్లాట్లలో ఇండ్లను నిర్మిస్తున్నారు. 2008లో 518 మందికి సర్వే నంబర్ 329లో ప్రభుత్వం ప్లాట్లు పంపిణీ చేసింది. వారిలో సగానికి పైగా నాయకులే ప్లాట్లు పంచుకున్నారన్న విషయంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. ప్లాట్లను పొందిన వారి లిస్టులను అధికారులు సర్వేచేసి అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చివేశారు. వారిలో ప్లాట్లు పొందిన నిరుపేదలను స్థానికంగా నష్టపోయిన నాయకులు, ప్రజాప్రతినిధులు ఇండ్లు నిర్మించుకోకుండా అడ్డుపడుతున్నారు. మాకు దక్కనిది మీకు దక్కవద్దనే తీరున 329 సర్వేనంబర్‌లో ఎలాంటి నిర్మాణాలు జరగడం లేదు. 16 ఏండ్ల తర్వాత తిరిగి ఖాళీ జాగాల్లో ఇండ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. గతంలో ప్లాట్లు పొందినవారిని బెదిరించి కొందరు నాయకులు వారి పాత పట్టాలను అగ్గువకు కొంటున్నారు. మరి కొందరు ప్లాట్లుగా చేయని ఖాళీ జాగాలను కబ్జా చేసి ప్లాట్లుగా చేసి ఇండ్ల నిర్మాణం చేపడుతున్నారు. మూడు రోజుల్లో దాదాపు 40కి పైగా నిర్మాణాలు జరిగాయి. మరోపక్క తమ ప్లాట్లను కబ్జా చేస్తున్నారని గతంలో పట్టాలు పొందిన గ్రామస్తులు కొత్తగా నిర్మాణాలు చేస్తున్న వారితో గొడవకు దిగుతున్నారు. చిట్కుల్‌లో ఒకే ప్లాట్ స్థలం కోసం ఇద్దరు తెరమీదకు రావడంతో ఘర్షణ వాతావరణం నెలకొన్నది. నాయకులు వారిని సర్ది చెప్పే ప్రయత్నం చేస్తున్నారు.

చకచకా నిర్మాణాలు...

చిట్కుల్ మెయిన్ రోడ్‌పై సర్వేనంబర్ 329లో విలువైన స్థలం ఉంది. గతంలో ఈ సర్వేనంబర్‌లో కొందరికి ప్రభుత్వం ప్లాట్లు కేటాయించింది. 1994లో ప్లాట్లు పంపిణీ చేసింది. 2000లోనూ ప్లాట్లు చేసి పేదలకు పంపిణీ చేసింది. ఆ ప్లాట్ల పంపిణీలో అవకతవకలు జరిగాయని వాటిని రద్దు చేశారు. తిరిగి 2008లో అప్పటి ప్రభుత్వం 518మంది పేదలకు పట్టాలు పంపిణీ చేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిగా ఉన్న దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా ఏప్రిల్ 8, 2008న ప్లాట్లు పంపిణీ చేశారు. పంపిణీ చేసిన ప్లాట్లలో బినామీలు ఉన్నారనే ఆరోపణలు అప్పుడే వచ్చాయి. ఆ తర్వాత గ్రామ నాయకులు ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులదరికీ ప్లాట్లు రాసుకున్నారనే ఆరోపణలు వినిపించాయి. అప్పుడు కూడా సెలవురోజుల్లో గ్రామ నాయకులు, ప్రజాప్రతినిధులు చకచకా ప్లాట్లలో ఇండ్ల నిర్మాణం ప్రారంభించారు. వంద గజాల ప్లాట్ స్థానంలో నాలుగు వందల గజాల ప్లాట్లలో నిర్మాణాలు చేపడుతుండడంతో కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. అప్పటి కలెక్టర్ పేదల ప్లాట్లలో నాయకులు కడుతున్న ఇండ్లను జేసీబీలతో కూల్చివేయించారు. 518 ప్లాట్లపై అధికారులతో విచారణ చేయించారు. విచారణలో గ్రామస్తులు, వడ్డెరకాలనీ వాసులైన పేదలు మాత్రమే అర్హులుగా తేల్చారు. పట్టాలు ఉన్న నిరుపేదలు ఇండ్లను నిర్మించేందుకు ప్రయత్నిస్తే, నాటి నాయకులు కోపంతో అడ్డుకుని పనులు జరగనివ్వలేదు. దీంతో గ్రామానికి చెందిన అర్హులు పట్టాలున్నా నాయకుల కారణంగా ఇండ్లు కట్టుకోలేని దుస్థితి ఏర్పడింది. ఇప్పుడు వారం రోజులుగా నాయకులు పావులు కదిపి పాత పట్టాలు ఉన్నవారి వద్దనుంచి వాటిని తక్కువ ధరలకు కొనుగోలు చేసి ఇండ్ల నిర్మాణం చేపడుతున్నారు. ఇదే సమయంలో మరికొందరు నాయకులు 329లోని మిగిలిన ఖాళీ జాగాలను కబ్జా చేస్తున్నారు. నాయకుల కుటుంబ సభ్యులు, అనుచరులు ఖాళీ జాగాలను కబ్జా చేసి శరవేగంగా ఇండ్లను నిర్మిస్తున్నారు. త్వరలో చిట్కుల్ గ్రామం ఇస్నాపూర్ మున్సిపాలిటీలో విలీనం అవుతుందనే ఆలోచనతో నాయకులు కబ్జాల పర్వానికి తెరలేపినట్లు ఆరోపణలు వస్తున్నాయి. గ్రామపంచాయతీగా ఉన్నప్పుడే ఇంటినంబర్ పొందాలనే ఆశతో నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిసింది. గ్రామ కార్యదర్శి కవిత, పటాన్‌చెరు ఆర్ఐ ఖాజా నిర్మాణాలు జరుగుతున్న 329 సర్వే నెంబర్ వద్దకు రాగా, ఇండ్ల నిర్మాణం చేస్తున్న వ్యక్తులు వచ్చి తమ వద్ద పట్టాలు ఉన్నాయని, నిర్మాణ పనులు ఆపమని తేల్చి చెప్పారు. ఈ విషయాన్ని వారు ఉన్నతాధికారులకు తెలిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యుత్ సమస్యలు తలెత్తవద్దు

సిద్దిపేటలో విద్యుత్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న హరీశ్‌రావు

- వేసవి సీజన్‌కు సిద్ధం కావాలి
- పదేండ్లలో ట్రాన్స్‌ఫార్మర్ కావాలని దరఖాస్తు పెట్టుకున్న దాఖలాలు లేవు
- నీళ్లు పుష్కలంగా ఉన్నాయి.. కరెంట్ సమస్య లేకుండా చూడాలి
- విద్యుత్ అధికారుల సమీక్షలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట,డిసెంబర్ 28: సిద్దిపేట నియోజకవర్గంలో వచ్చే ఎండాకాలంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే ప్రణాళికతో వ్యవహరించాలని ట్రాన్స్‌కో అధికారులకు మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు. శనివారం సిద్దిపేటలోని ఎస్ఈ కార్యాలయంలో విద్యుత్ అధికారులతో ఆయన సమీక్షా నిర్వహించారు. నియోజకవర్గంలో ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రైతులు ఇబ్బంది పడుతున్నారని తన దృష్టికి వచ్చిందని, గత పదేండ్లలో ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రైతులు దరఖాస్తు పెట్టిన దాఖలాలు లేవన్నారు. నియోజకవర్గంలో 200 వరకు దరఖాస్తులు వచ్చాయని, వీరలాపూర్‌లో 30 వరకు, రాంపూర్‌లో 15 వరకు దరఖాస్తులు ట్రాన్స్‌ఫార్మర్ల కోసం వచ్చాయన్నారు. వెంటనే సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రంగనాయకసాగర్‌లో నీళ్లు పుష్కలంగా ఉన్నాయని, విద్యుత్ సమస్యలు రాకుండా చూడాలన్నారు. సబ్‌స్టేషన్‌లలో ఇబ్బందులు తలెత్తవద్దని, అవసరమైన చోట కొత్తగా సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలన్నారు. విద్యుత్ పోల్స్, స్ట్రీట్ లైట్స్ ఎక్కడ అవసరం ఉన్నా అధికారులు వెంటనే బింగించాలన్నారు. గృహజ్యోతి దరఖాస్తులు ఇవ్వని వారికి మళ్లీ అవకాశం కల్పించాలని అధికారులకు సూచించారు. రజకులకు, నాయీ బ్రాహ్మణులకు బీఆర్ఎస్ హయాంలో ఉచిత కరెంట్ సరఫరా చేశామని, దీనిపై ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలని హరీశ్‌రావు ఆదేశించారు. సమీక్షలో విద్యుత్ ఎస్ఈ, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

చింతమడక, మాచాపూర్, సీతారాంపల్లి గ్రామాల్లో పెండింగ్ పనులను వేగంగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ మను చౌదరిని ఎమ్మెల్యే హరీశ్‌రావు కోరారు. శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌తో ఆయన సమావేశమై చింతమడక, మాచాపూర్, సీతారాంపల్లి గ్రామాల పెండింగ్ ఇండ్ల నిర్మాణ పనుల గురించి వివరించారు. వేగంగా పనులు పూర్తి అయ్యేలా మాడాలని కోరారు. ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కాంట్రాక్టర్ మధ్యలో పనులు ఆపేసి వెళ్లిపోయారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.



సిద్దిపేటలోని కార్ల అడ్డా వద్ద ట్యాక్సీ డ్రైవర్లతో మాట్లాడి వారి కష్టసుఖాలు తెలుసుకున్న హరీశ్‌రావు

గిరాకీ లేక కిస్తీలు ఎల్లడం లేదు సార్

- యాడాది కిందటి వరకు మంచిగుండే
- కాంగ్రెస్ వచ్చాక అన్నీ బంద్ అయినయి సార్
- రియల్ ఎస్టేట్ పడిపోయింది.. మాబండ్లకు గిరాకీ లేకుండా పోయింది
- హరీశ్‌రావుకు బాధలు చెప్పుకొన్న ట్యాక్సీ డ్రైవర్లు

సిద్దిపేట, డిసెంబర్ 28: సార్. ఆటోలకు గిరాకీ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సిద్దిపేట ట్యాక్సీ డ్రైవర్లు మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుతో బాధలు చెప్పుకొన్నారు. శనివారం సిద్దిపేట పర్యటనలో భాగంగా పట్టణంలోని కార్ల అడ్డా వద్ద కొద్దిసేపు ఆగి ట్యాక్సీ డ్రైవర్లతో హరీశ్‌రావు ముచ్చటించారు. ఈ సందర్భంగా ట్యాక్సీ డ్రైవర్లతో మాట్లాడి వారి సాదకబాధలు తెలుసుకున్నారు. అడ్డా మీద ఎన్ని కార్లు ఉన్నాయి, గిరాకీ ఎలా ఉందని ఆరాతీశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్నీ బంద్ అయిన యి సార్, రియల్ ఎస్టేట్ సరిగా నడుస్తలేదు సార్.. మా బండ్లకు కిరాయిలు లేక ట్యాక్సీ డ్రైవర్లం అం దరం రోడ్డు మీద పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. గిరాకీలు లేక నెలనెలా వాహనానికి కిస్తీలు కట్టలేకపోతున్నామని బాధ వ్యక్తం చేశారు. కొత్తబండి కొనాలంటే ఎలాంటి రుణాలు దొరకడం లేదన్నారు. ఏడాది కిందటి వరకు నెలకు రూ.15 వేల వరకు కిరాయిలు వచ్చేవని, ఇప్పుడు నెలకు నాలుగువేల కిరాయిలు కూడా ఎల్లడం లేదని, కుటుంబాలను పోషించుకోలేక పోతున్నామని వాపోయారు. బీఆర్ఎస్ సర్కారు ఉన్నప్పుడు పం టకు పెట్టుబడి రైతుబంధు వచ్చేదన్నారు. రైతుబం ధు డబ్బులతో మేం ఎవుసం ఖర్చులు ఎల్లదీసుకుని, పంటకు వచ్చిన పైసలతో ఫైనాన్స్ కిస్తీలు కట్టుకొనేవాళ్లం సార్, ఇప్పుడు పెట్టుబడి సాయం బంద్ అయ్యి మాకు చానా ఇబ్బంది అవుతున్నదని ట్యాక్సీ డ్రైవర్లు బాధ చెప్పుకొచ్చారు. పోలీసులు కూడా చిన్నచిన్న కారణాలకు అడ్డగోలుగా చలాన్లు రాస్తున్నారని, ట్యాక్సీ డ్రైవర్ల పట్ల పక్ష పాతం చూపిస్తున్నారని, పక్క రాష్ట్రాల వాళ్లు సిద్దిపేట వాసులు అంటే ప్రత్యేక అభిమానం ఉందని, కానీ.. సొంత రాష్ట్రంలోనే కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని వా పోయారు. కాంగ్రెస్ సర్కారు వచ్చాక గంజాయి, డ్రగ్స్ విపరీతంగా పెరిగిపోయాయని, ఈ ప్రభు త్వం తీరుతో యువత చెడిపోతున్నారని ట్యాక్సీ డ్రైవర్లు హరీశ్‌రావుకు చెప్పుకువచ్చారు. కాంగ్రెస్ వచ్చాక తమ బతులకు ఆగమయ్యాయన్నారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చేదాకా మాకు బాధలు తప్పవన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

ఝరాసంగం మండలనాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు

ఝరాసంగం, డిసెంబర్ 28: నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు పిలుపునిచ్చారు. శనివారం ఝరాసంగం మండల కేంద్రంతో పాటు కుప్సానగర్, తుమ్మన్‌పల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్థాయి నాయకులకు ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వంపై పోరాటం చేయాలన్నారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెంకటేశం, మాజీ అధ్యక్షుడు బొగ్గుల సంగమేశ్వర్, కేతకీ ఆలయ మాజీ చైర్మన్ నర్సింహగౌడ్, మాజీ జడ్పీటీసీ పండరినాథ్, ఝరాసంగం పట్టణాధ్యక్షుడు ఏజాజ్‌బాబా, సోహెల్, ఖలీల్, ప్రభు పటేల్, వెంకట్‌రెడ్డి, జగదీశ్వర్, బషీర్ సాబ్, రాజ్‌కుమార్, దశరథ్, రవికుమార్, నాగన్న, లక్ష్మణ్, రాజు, శ్రీధర్, శిరోమణి, నర్సింహులు, సంగమేశ్, కార్యకర్తలు ఉన్నారు.

సంగారెడ్డిలో పెరిగిన క్రైం రేట్: ఐజీ

మాట్లాడుతున్న ఐజీ సత్యనారాయణ

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 28: సంగారెడ్డి జిల్లాలో క్రైం రేట్ పెరిగిందని, క్రైం డిటెక్షన్, లా అండ్ ఆర్డర్‌లో పోలీసుల పనితీరు బాగున్నదని మల్టీ జోన్-2 ఐజీ సత్యనారాయణ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయాన్ని శనివారం తనిఖీ చేశారు. సిబ్బందికి టర్న్ అవుట్, మ్యాబ్రిల్ డ్రిల్, వెపన్ డ్రిల్ తనిఖీ చేశారు. ఆర్మ్‌డ్ రిజర్వ్స్ కార్యాలయంలో రికార్డులను, ఆయుధగారాన్ని పరిశీలించారు. వాహనాల కండీషన్, రికార్డుల నిర్వహణపై ఆరాతీశారు. సిబ్బందికి రావాల్సిన ఇంక్రిమెంట్స్, సరెండర్ లీవ్స్, రివార్డులు, అవార్డులు, సర్వీస్ బుక్ నిర్వహణ వంటి విషయాలను ఎప్పటికప్పుడు పూర్తిచేయాల్సిన బాధ్యత అడ్మిన్ విభాగంపై ఉందన్నారు. ఐజీ వెంట ఎస్పీ రూపేశ్, అదనపు ఎస్పీ సంజీవరావు, డీటీసీ అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, ఏహో కల్యాణి, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు ఉన్నారు.

ఉపాధ్యాయులు వద్దంటే నష్టపోతారు..

విద్యార్థినులకు నచ్చజెపుతున్న డీఈవో

పాపన్నపేట, డిసెంబర్ 28: కేజీబీవీ ఉపాధ్యాయులే తమకు పాఠాలు బోధించాలని, ఇతర పాఠశాలల ఉపాధ్యాయులు వద్దని శనివారం పాపన్నపేట కస్తూర్బా విద్యాలయ విద్యార్థినులు నిరసన చేపట్టారు. ఉపాధ్యాయులను వెనక్కి పంపిన విషయం తెలుసుకున్న డీఈవో రాధాకిషన్ శనివారం ఎంఈవో ప్రతాప్‌రెడ్డితో కలిసి పాఠశాలను సందర్శించి విద్యార్థినులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయులు సమ్మెలో ఉన్నందున ప్రత్యామ్నాయంగా పాపన్నపేట పాఠశాల ఉపాధ్యాయులను పంపించామని, వారిని వెనక్కి పంపించడం సమజంసం కాదన్నారు. వారిని వాపస్ పంపితే మీరే నష్టపోతారని విద్యార్థినులకు నచ్చజెప్పారు. ఉపాధ్యాయులు తమ సమస్యల కోసం పోరాడుతారని, వారి కోసం మీ జీవితాలను నాశనం చేసుకోవద్దంటూ డీఈవో విద్యార్థులకు నచ్చచెప్పారు.

మున్సిపాలిటీ వద్దని బొంతపల్లిలో తీర్మానం

బొంతపల్లి జీపీ ప్రాంగణంలో గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

గుమ్మడిదల, డిసెంబర్ 28: సంగారెడ్డి జిల్లా బొంతపల్లిని మున్సిపాలిటీగా మార్చడాన్ని అందరూ వ్యతిరేకిస్తున్నారు. శనివారం నిర్వహించిన గ్రామసభలో పార్టీలకతీతంగా వ్యతిరేకించారు. మున్సిపాలిటీ వద్దంటూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. కొత్తగా మున్సిపాలిటీ ఏర్పాటు చేసి పేదలపై పన్నుల భారం వేయవద్దని కోరారు. శనివారం బొంతపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక అధికారి, ఎంపీడీవో ఉమాదేవి ఆధ్వర్యంలో గ్రామ సభను ఏర్పాటు చేశారు. ఈ సభలో మాజీ సర్పంచ్‌లు ఆలేటి నవీనాశ్రీనివాస్‌రెడ్డి, సురభి నాగేందర్‌గౌడ్,సీనియర్ నాయకుడు సద్ది విజయభాస్కర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ ఆలేటి సంజీవరెడ్డితో పాటు పలు పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు. గ్రామానికి సంబంధించిన యూజీడీ, సీసీ రోడ్లు, ఫార్మేషన్ రోడ్డు ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారు. బొంతపల్లి, దోమడుగు, అన్నారం, వీరన్నగూడెం గ్రామాలతో గుమ్మడిదల కేంద్రంగా కొత్త మున్సిపాలిటీ ఏర్పాటుకు ప్రభుత్వం చేస్తుండడంతో శనివారం గ్రామసభలో వద్దని ఏకగ్రీవ తీర్మానం చేశారు. గ్రామసభలో ఎంపీవో దయాకర్‌రావు, నాయకులు సుంకరి శంకర్, వినోద్‌గౌడ్, గటాటి రమేశ్, శ్రీను, నగేశ్, చక్రపాణి తదితర నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మల్లన్న కల్యాణానికి వేళాయే..

సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలో ఏర్పాటు చేసిన స్వాగత తోరణాలు, కల్యాణ వేదిక వద్ద అలంకరణ

- నేడు కొమురవెల్లి 'మల్లికార్జునుడి' కల్యాణం
- భారీగా తరలిరానున్న భక్తులు
- వేడుక నిర్వహణకు 14 మంది అధికారులు, సిబ్బంది నియామకం

చేర్యాల, డిసెంబర్ 28: సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించనున్నారు. ఈ వేడుకకు రాష్ట్రంతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు హాజరుకానున్నారు. ఇప్పటికే ప్రముఖులకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. మంత్రులు, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌గౌడ్, జనగామ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు. జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి కల్యాణోత్సవానికి హాజరుకానున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం వరుడు మల్లికార్జున స్వామి తరపున పడిగన్నగారి వంశస్తులు, వధువులు మేడలాదేవి, కేతమ్మదేవీ తరపున మహాదేవుని వంశస్తులు పాల్గొని కల్యాణాన్ని జరిపిస్తారు. ఆదివారం ఉదయం 10.45 గంటలకు కొమురవెల్లి క్షేత్రంలోని ఇంద్రకీలాద్రి ఆలయ ప్రాంగణంలోని తోట బావి వద్ద గల కల్యాణ వేదికలో 1008 జగద్గురు డాక్టర్ మల్లికార్జున విశ్వారాధ్య శివాచార్య స్వామి ఆధ్వర్యంలో వేద పర్యవేక్షణలో కల్యాణం జరగనున్నది. ఉత్సవాలు రెండు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నారు. 30వేల వరకు భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని ఆలయవర్గాలు తెలిపాయి. కల్యాణ వేదిక తోటబావి ప్రాంతంలో నిర్మించిన శాశ్వత కల్యాణ వేదిక వద్ద బారికేడ్లు, షామియానాలు, పచ్చదనం ఉట్టిపడే విధంగా పలు ఏర్పాట్లు చేస్తున్నారు. కల్యాణ వేదిక వద్ద మరో 8 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. నూతన క్యూలైన్ల నిర్మాణం చేపట్టడడంతో రాజగోపురం వద్ద చలువ పందిళ్లతో తాత్కాలిక క్యూలైన్లు ఏర్పాట్లు చేశారు. నూతనంగా నిర్మించిన భవనంలో ప్రసాదాల విక్రయ కౌంటర్ల వద్ద తాగునీటి వసతి కల్పిస్తున్నారు. 24 గంటల విద్యుత్ సరఫరాతో పాటు తాగునీరు అందించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. 60వేల లడ్డూ ప్రసాదాలు, 5 క్వింటాళ్ల పులిహోర ప్యాకెట్లను తయారు చేశారు. రెగ్యులర్ ఉద్యోగులు, ఔట సోర్సింగ్ సిబ్బంది మొత్తం 70 మంది, 100 మంది వలంటీర్లు విధులు నిర్వహించనున్నారు. పలువురు ప్రభుత్వశాఖల అధికారులకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. సిద్దిపేట, జనగామ జిల్లా కేంద్రాల నుంచి ప్రత్యేకంగా బస్సులు నడిపించేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 300 మంది పోలీసులు బందోబస్తు విధులు నిర్వర్తించనున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆర్‌జేసీ రామకృష్ణారావు ఆధ్వర్యంలో కీసరగుట్ట ఏసీ సుధాకర్‌రెడ్డితో పాటు వివిధ దేవాలయాలకు చెందిన 14 మంది అసిస్టెంట్ కమిషనర్లు, ఈవోలు, సూపరింటెండెంట్లు, సిబ్బందిని కల్యాణోత్సవ నిర్వహణకు దేవాదాయ శాఖ నియమించింది.ప్రత్యేక అధికారుల బృందంలో ఏసీ ఎ.కృష్ణ, ఎ.చంద్రశేఖర్, వి.శ్రీనివాసరాజు, ఎం.శ్రీనివాసశర్మ, పి.విశ్వనాథశర్మ, రవికుమార్, యు.శశిధర్, వి.రంగారావు, పి.గురుభద్రమ్మ, ఎన్.చంద్రశేఖర్, పి.శ్రీధర్‌రెడ్డి, బి.నరేశ్, జి.కిషన్, ఎస్.శ్రీనివాస్‌ను నియమించారు.

స్వామివారి పూజా సామగ్రి సిద్ధం

మల్లన్న పూజా సామగ్రిని సిద్ధం చేస్తున్న అర్చకులు

చేర్యాల, డిసెంబర్ 28: కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం సందర్భంగా నిర్వహించే ప్రత్యేక పూజల వెండి తదితర సామగ్రిని ఆలయ అర్చకులు సిద్ధం చేశారు. ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్ ఆధ్వర్యంలో అర్చకులు స్వామి వారి కల్యాణంలో ఉపయోగించే స్వర్ణ కిరీటం, కోరమీసాలు, ఖడ్గం, రుద్రాక్షమాల, స్వామి వారి నామాలు, పంచహారతి, రుద్రపాదం తదితర వెండి, పంచలోహ సామగ్రికి ప్రత్యేక పూజలు నిర్వహించి సిద్ధం చేశారు. కల్యాణోత్సవం మొదలు కొని ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన తదితర పూజలకు అన్ని ఏర్పాట్లు చేశారు.

మా సార్లు మాకే కావాలి

వర్గల్, డిసెంబర్ 28: సిద్దిపేట జిల్లా వర్గల్‌లోని కస్తూర్బా విద్యాలయానికి డిప్యూటేషన్‌పై ఉపాధ్యాయులు రావడాన్ని శనివారం విద్యార్థినులు వ్యతిరేకించి తరగతులను బహిష్కరించారు. పాఠశాలలో బైఠాయించి నిరసన తెలిపారు. సమగ్ర శిక్షా ఉద్యోగులతో పాటు కస్తూర్బాలో పనిచేస్తున్న టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగులు ఉద్యోగ భద్రత, కనీస వేతనాల కోసం సమ్మెబాట పట్టారు. వారి స్థానంలో ఎస్‌జీటీలను తాత్కాలికంగా నియమించడంతో వారు వద్దని విద్యార్థినులు తేల్చి చెప్పారు. ప్రిన్సిపాల్ రజిత, ఉపాధ్యాయులు విద్యార్థినులను సముదాయించారు.

నిరసన తెలుపుతున్న విద్యార్థినులు

కల్యాణ మహోత్సవానికి భారీ బందోబస్తు

అడిషనల్ డీసీపీ రామచంద్రరావు

చేర్యాల, డిసెంబర్ 28: కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవానికి పోలీస్‌శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఏఆర్ అడిషనల్ డీసీపీ రామచంద్రరావు తెలిపారు. శనివారం హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, సిద్దిపేట ఏసీపీ మధు, గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రవీందర్, చేర్యాల సీఐ శ్రీను, ఎస్ఐ రాజుతో కలిసి ఆయన కల్యాణం నిర్వహించే తోటబావి ప్రాంతం, వీఐపీ పార్కింగ్, జనరల్ పార్కింగ్, దర్శన ప్రదేశాలను పరిశీలించి బందోబస్తుపై సూచనలు చేశారు. ఆదివారం ఉదయం 6 గంటల వరకు అధికారులు, సిబ్బంది కేటాయించిన ప్రదేశాల్లో విధి నిర్వహణలో ఉండాలన్నారు. ఇన్‌చార్జి అధికారులు వీహెచ్ఎఫ్ సెట్‌ఛాయండిల్ చేయాలన్నారు. భక్తులతో మర్యాదగా ప్రవర్తించాలని, పోలీసులతో ఎవరికి ఇబ్బంది కలుగకుండా క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సూచించారు. మూడు నెలల పాటు జరిగే బ్రహ్మోత్సవాలకు ప్రతి ఆదివారం భక్తులు భారీగా వస్తారని, నాలుగు సెక్టార్లుగా విభజించి బందోబస్తు చేపట్టనున్నట్లు ఏఆర్ అడిషనల్ డీసీపీ వెల్లడించారు. పోలీస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, భక్తులు ఉపయోగించుకోవాలని కోరారు. కల్యాణ వేదిక వద్ద, పార్కింగ్ ప్రదేశాలు, టెంపుల్ ఆవరణలో 75 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇద్దరు అడిషనల్ డీసీపీలు, ఆరుగురు ఏసీపీలు, 25 మంది సీఐలు, 26 మంది ఎస్సైలతోపాటు ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, మహిళా కానిస్టేబుళ్లు, మహిళా హోంగార్డులు, బీడీ టీమ్స్, యాక్సెస్ కంట్రోల్, రోప్ పార్టీ మొత్తం 361 అధికారులు, సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు చేపడుతున్నట్లు డీసీపీ రామచంద్రరావు తెలిపారు. తోటబావి సమీపంలో ఎడమవైపు చుట్టూ ప్రహరీ ఉన్న ప్రదేశంలో వీఐపీ పార్కింగ్,